# రెండో రోజూ అదే జోరు...

- 'ప్రజాపాలన'లో కొనసాగుతున్న రద్దీ
- దరఖాస్తులు ఇచ్చేందుకు బారులు తీరుతున్న ప్రజలు
- తెల్లకాగితంపై సమస్య రాసిచ్చినా తీసుకోవాల్సిందే..!


ఫిలింనగర్ భగత్‌సింగ్ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద రద్దీ

**బంజారాహిల్స్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం రెండోరోజు శుక్రవారం వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆశావహులు ఉదయం నుంచే కేంద్రాల వద్ద బారులు తీరారు. ఆరు గ్యారంటీల అమలు లక్ష్యంగా చేపట్టిన వార్డు సభలకు ఉదయం నుంచే అధిక సంఖ్యలో జనం విచ్చేసి దరఖాస్తులతో తంటాలు పడ్డారు. వంద కుటుంబాలకు ఒకరుచొప్పున ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో అన్ని డివిజన్లలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. విమర్శలు తలెత్తకుండా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే పక్కా ప్రణాళికతో అన్ని కేంద్రాల వద్ద అందుబాటులో దరఖాస్తులను ఉంచారు. అలాగే తెల్లకాగితం మీద తమ సమస్య రాసిచ్చినా తీసుకోవాలని గట్టిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో అన్ని కేంద్రాల వద్ద జనం బారులు తీరినా దరఖాస్తుల కోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. సమీప నియోజకవర్గాల పరిధిలో దరఖాస్తు ఫారాలు కలర్‌లో ఉంటేనే తీసుకుంటున్నట్లు ఆరోపణలు రావడంతో అప్పటికప్పుడు అటు జోనల్ కమిషనర్, డీఎంసీ స్పందించి సర్కిల్–17, 18 పరిధిలో ఎవరు కాగితంపై సమస్య రాసిచ్చినా తీసుకోవాలని సూచించారు. చాలా మంది రేషన్ కార్డు కోసం తెల్లకాగితంపై అర్జీలు పెట్టుకున్నారు. దరఖాస్తుల్లో ఎక్కువగా తెల్ల రేషన్ కార్డు కోసమే దరఖాస్తులు వెల్లువెత్తాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్లలో మొత్తం 10 ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**సందేహాలతో కుస్తీ పడ్డ జనం...**

- ఫారంలో నాలుగు పేజీలు ఉండగా ఎక్కడా లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతా నెంబర్‌ను ప్రస్తావించలేదు. దీంతో చాలా మంది నగదు సహాయం ఎక్కడ జమ చేస్తారు. వాటి వివరాలు ఎక్కడ తీసుకుంటారు అనే అయోమయానికి గురయ్యారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తే అధికారుల నుంచి జవాబు కరువైంది.
- గృహ జ్యోతి పథకంలో యజమాని పేరు విషయంలోనూ చాలా మంది అయోమయానికి గురయ్యారు.
- గ్యాస్ కనెక్షన్ల విషయానికి వస్తే ఒకటికంటే ఎక్కువ ఉన్నాయి, ఒక వేళ అన్ని కనెక్షన్ల నెంబర్లు వివరాలు ఇస్తే ఒకదానికి రాయితీ వచ్చి మిగిలిని వాటికి రాదేమోనన్న ఆందోళన మహిళల్లో కనిపించింది.
- ఒక ఇంట్లో రెండుకంటే ఎక్కువ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కొన్ని ఇళ్లల్లో అద్దెకుంటున్నవారూ ఉన్నారు. 200 యూనిట్ల కంటే తక్కువ వినియోగానికి రాయితీ ఇందులో ఏ కనెక్షన్‌కు వర్తిస్తుంది అంటూ విధుల్లో ఉన్న ఉద్యోగులను అడగగా తమకేమీ తెలియదని కేవలం దరఖాస్తులు మాత్రమే తీసుకుంటున్నామంటూ చెప్పుకొచ్చారు. అయితే జనం చాలా సమస్యలతో సతమతమవుతూ ఆ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కేంద్రాల వద్ద ప్రయత్నించినా ఏ ఒక్కరూ సరైన సమాధానం ఇవ్వలేకపోవడంతో ఏదోఒకటి ఇచ్చిపోదామనే ధోరణిలోనే చాలా మంది కనిపించారు.

### నేడు ప్రజాపాలన జరగనున్న కేంద్రాలివే...

- బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని సీఎంటీసీ బిల్డింగ్‌లో కమాన్ ఎన్బీటీ నగర్ బస్తీవాసులకు..
- బంజారాహిల్స్ రోడ్ నెం. 13లోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో వేమిరెడ్డి ఎన్‌క్లేవ్ కాలనీవాసులకు...
- బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ఎన్బీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎన్బీ నగర్ బస్తీవాసులకు.
- ప్రేమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో భోలానగర్ బస్తీవాసులకు...
- బంజారాహిల్స్ రోడ్ నెం. 7 మీసేవా బిల్డింగ్‌లో సంజయ్ నగర్ బస్తీవాసులకు...
- బంజారాహిల్స్ రోడ్ నెం. 10 ఇబ్రహీంనగర్ కమ్యూనిటీ హాల్‌లో నూర్‌నగర్ బస్తీవాసులకు.
- పంజగుట్ట ప్రతాప్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో దేవరకొండ బస్తీ వాసులకు...
- గౌరీ శంకర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సింగాడికుంట బస్తీవాసులకు...
- జూబ్లీహిల్స్ క్లబ్ ఎదురుగా ఉన్న వార్డు కార్యాలయంలో ప్రశాసన్‌నగర్ కాలనీవాసులకు.
- భగత్‌సింగ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో జ్ఞానిజైల్‌సింగ్‌నగర్ బస్తీవాసులకు...
- జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఇందిరానగర్ బస్తీవాసులకు...
- గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో దుర్గా భవానీనగర్ బస్తీవాసులకు.

### మొత్తం 14015 దరఖాస్తులు

జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో శుక్రవారం వివిధ పథకాల లబ్ధి కోసం 8628 దరఖాస్తులు వచ్చాయి. గురు, శుక్రవారాల్లో కలిపి మొత్తం 14015 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.


వెంకటేశ్వరకాలనీ డివిజన్ వార్డు కార్యాలయంలో...


జూబ్లీహిల్స్ గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో...

### పించన్ కోసం వచ్చా



ఇప్పటి వరకు దివ్యాంగుల పెన్షన్ కోసం నాలుగుసార్లు గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్నాను. మా బస్తీకి ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో అభ్యర్థులు వచ్చినప్పుడు వారి కాళ్లు పట్టుకొని వేడుకున్నా. అయితే ఇప్పటి వరకు పింఛన్ మాత్రం మంజూరు కాలేదు. పింఛన్‌కు నేను పూర్తి అర్హుడిని అయినాసరే అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రజాపాలన అంటూ ఈ సభలు ఏర్పాటు చేయడంతో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వచ్చాను. ఈ సారైనా మంజూరు అవుతుందనే ఆశతో ఉన్నాను.

– బాలపీరు, దివ్యాంగుడు, అంబేద్కర్‌నగర్

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


దరఖాస్తులను అందిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

**శ్రీనగర్‌కాలనీ:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లోని కేంద్రాలను పర్యటించి అక్కడి ప్రజల దరఖాస్తుల్లోని సమస్యలను తెలుసుకొని పూర్తియిన దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా, అర్హులైన అందరికీ దరఖాస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నేతలు డి.సంజీవ, షరీఫ్ ఖురేషి, గంట మల్లేష్ పాల్గొన్నారు.



## పీజేఆర్ క్రికెట్ టోర్నీ విజేత ఎంఎస్ మక్తా జట్టు


క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న విజయారెడ్డి

**ఖైరతాబాద్:** దివంగత నాయకుడు పి.జనార్దన్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ డివిజన్‌లోని ఎంఎస్‌మక్తాలో పీజేఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి విజేత, రన్నరప్ టీంలకు ట్రోఫీని పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ విజయారెడ్డి అందజేశారు. టోర్నీలో మొత్తం 50 టీంలు పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో ఎంఎస్ మక్తాకు చెందిన టీం విజేతగా నిల్చింది. రన్నపర్‌గా సయ్యద్ బ్రదర్స్ టీం నిల్చింది. విజేత టీంకు రూ. 25 వేలను విజయారెడ్డి అందజేశారు.

## ఘనంగా అభ్యాస పాఠశాల వార్షికోత్సవం



**లక్డీకాపూల్:** అభ్యాస పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి. డాక్టర్ విభా ఆస్థాన, గులాం అహ్మద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. పాఠశాల నిర్వాహణాధికారులు ఈషా మెహతా, దివ్యారెడ్డి, పాఠశాల ప్రధానాచార్యులు లక్ష్మి పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ముగ్ధ సిల్క్‌షోరూం వద్ద ఈ నెల 26వ తేదీన ఉదయం గుర్తు తెలియని మృతదేహం(50) ఫుట్‌పాత్‌పై ఉండగా స్థానికులు గుర్తించి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మృతదేహానికి సంబంధించి స్థానికంగా ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. కొంత కాలంగా ఈ ప్రాంతంలో యాచిస్తూ బతుకు వెళ్లదీస్తున్నాడని స్థానికులు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే ఫోన్: 87126 60454లో సంప్రదించాలని ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు

**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లోని హార్ట్‌కప్ వద్ద ఓ మహిళ అదుపుతప్పిన వేగంతో టీఎస్ 09 ఈక్యూ 3030 నెంబర్ కారులో దూసుకొస్తూ అక్కడ విధి నిర్వహణలో ఉన్న పి.వెంకటేశ్వర్లు అనే హోంగార్డును ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్వర్లుకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. కారు నడుపుతున్న మహిళపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితుడు ఫిర్యాదు చేయగా జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జనవరి 11 నుంచి హైలైఫ్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్



**బంజారాహిల్స్:** పర్వదినాలు, వివాహాది శుభకార్యాల కోసం ప్రత్యేకంగా రూపుదిద్దుకున్న డిజైనర్ దుస్తులు, ఆభరణాలను జనవరి 11 నుంచి 13వ వరకు హెచ్ఐసీసీ నోవాటెల్‌లో హైలైఫ్ ఫ్యాషన్ లగ్జరీ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనకు సంబంధించి శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం 10లో డిజైనర్ దుస్తులు, ఆభరణాల సన్నాహక ప్రదర్శన జరిగింది. సినీ తారలు శుభశ్రీ రాయగురు, ప్రీతి సుందర్‌తో పాటు పలువురు మోడల్స్ కనువిందు చేసే దుస్తులు ధరించి సందడి చేశారు. దేశ వ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన డిజైనర్లు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించనున్నారని నిర్వాహకులు తెలిపారు. బ్రైడల్ వేర్ ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందన్నారు.

బస్తీల్లో స్పందన భేష్..

వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య

## కాలనీవాసుల్లో చైతన్యం రావాలి


జవహర్‌నగర్ బస్తీలో హాజరైన మహిళలు


కళ్యాణ్‌నగర్ కేంద్రంలో ఇలా...

**వెంగళరావునగర్:** ప్రజాపాలన కార్యక్రమానికి బస్తీల్లోని ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, అందువల్ల ప్రతి ఒక్కరికీ దరఖాస్తులు అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ సూచించారు. డివిజన్ పరిధిలోని నాలుగు కౌంటర్లలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్సీ హాస్టల్‌లో మహిళలు తమకు దరఖాస్తులు అందలేదని ఆమెకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ ప్రజలకు తగినన్ని దరఖాస్తులు సిద్ధం చేయాలని సూచించారు. అంతేగాకుండా అప్పటికప్పుడు దరఖాస్తులను తెప్పించి వారికి అందజేశారు. అనంతరం కళ్యాణ్‌నగర్‌కాలనీ సెంటర్‌కు వెళ్లిన కార్పొరేటర్‌కు అధికారులు, సిబ్బంది మాత్రమే ఉండటాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అరగంట తర్వాత అడపా దడపా ఒకరిద్దరు మాత్రమే దరఖాస్తు కోసం రావడం పట్ల విస్మయం చెందారు. వారితో కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో వాచ్‌మెన్‌లుగా విధులు నిర్వహించే కుటుంబీకులు, సాధారణ ప్రజలు సైతం ప్రజాపాలనపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అందరికీ సరిపడ దరఖాస్తులు సిద్ధంగా ఉన్నాయని, ఉచితంగానే ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, పవన్ ముదిరాజ్, కిట్టు, పూజారి బాలు, జహంగీర్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ వ్యవస్థలో బలహీనవర్గాలకు స్థానం కల్పించాలి

**పంజగుట్ట:** న్యాయ వ్యవస్థలో బడుగు, బలహీన వర్గాలకు కూడా స్థానం కల్పించాలని ఫోరం ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ అడ్వకేట్స్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్, రిటైర్డ్ జడ్జి, తెలంగాణ జడ్జిల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నిమ్మ నారాయణ కోరారు. న్యాయాన్ని, ధర్మాన్ని కాపాడాల్సిన న్యాయవ్యవస్థలో అధికశాతం ఉన్న వారికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, న్యాయవాది భీమరావు మాట్లాడుతూ... న్యాయవ్యవస్థ ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్నత న్యాయస్థానంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 నుంచి 10 శాతం మాత్రమే స్థానం కల్పిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఫోరం కో ఆర్డినేటర్లు బైరి రాకేష్ కుమార్, దున్న అంబేద్కర్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, మేకల కమలాకర్, అన్నపూర్ణ, సుమిత్ర, సల్మా పాల్గొన్నారు.





అప్‌డేట్ ప్లీజ్...!

జూబ్లీహిల్స్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈ–కేవైసీ కోసం బారులు తీరిన వినియోగదారులు


బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని మీ–సేవా కేంద్రం వద్ద బారులు తీరిన జనం

**బంజారాహిల్స్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ. 500లకే గ్యాస్ సిలిండర్ కూడా ఉండటంతో జనం ఈ–కేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. అయితే ఇంత వరకు తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని డీలర్లు మొత్తుకుంటున్నా వినియోగదారులు మాత్రం వినిపించుకోవడం లేదు. ఈ–కేవైసీ చేయించుకోకపోతే తమకు రూ. 500 గ్యాస్ సిలిండర్ రాదేమోనన్న ఆందోళన మహిళల్లో వ్యక్తం అవుతున్నది. దీంతో గత రెండు వారాల నుంచి ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లోని అన్ని గ్యాస్ ఏజెన్సీల వద్ద మహిళలు ఉదయం 7 గంటల నుంచే గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ కడుతున్నారు. కేవలం ఉజ్వల స్కీంకు మాత్రమే ఈ–కేవైసీ అవసరమని మిగతా వారందరికీ ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైన తర్వాత తీసుకుంటామని డీలర్లు పేర్కొంటున్నారు. ప్రజలు మాత్రం ఇదేమీ వినిపించుకోవడం లేదు. పనులు మానుకొని గంటల తరబడి గ్యాస్ ఏజెన్సీల వద్ద వేచి చూస్తున్నారు. గ్యాస్ డీలర్లు మాత్రం వినియోగదారులతో వాదనలు చేయలేక వచ్చిన వారందరికీ ఈ–కేవైసీని నమోదు చేసుకుంటున్నారు. ఒక్కో వినియోగదారుడికి పది నిమిషాల సమయం పడుతుండటంతో గ్యాస్ ఏజెన్సీల పరిసర ప్రాంతాలన్నీ రోడ్లకు రెండువైపులా పార్కింగ్‌లు, జనంతో కిటకిటలాడుతున్నాయి. ఏజెన్సీల వద్ద ట్రాఫిక్ పోలీసులను నియంత్రించడానికి ఏర్పాటు చేయాల్సిందిగా పలువురు గ్యాస్ డీలర్లు మొరపెట్టుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

## పని చేస్తున్న ఇంటికే కన్నం: కేసు నమోదు

**బంజారాహిల్స్:** పని చేస్తున్న ఇంటికే కన్నం వేసిన మహిళ కోసం బంజారాహిల్స్ పోలీసులు గాలింపు చేపట్టారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నెం. 8లోని వైట్‌హౌస్ సెలెస్టియా అపార్ట్‌మెంట్స్‌లో నివసించే కొడాలి ధనలక్ష్మి అక్టోబర్ 16వ తేదీన మంగోలియా దేశం విజిట్‌చేసేందుకు బ్యాగులో మూడు వజ్రాలు పొదిగిన గాజులు, ఒక బంగారు గాజు, మరో వాచీని సర్దుకుంది. ఆ బ్యాగు తీసుకొని మంగోలియా యాత్రకు వెళ్లింది. అక్కడికి చేరిన తర్వాత బ్యాగు తెరిచి చూడగా అందులో ఉండాల్సిన రూ. 10 లక్షల వజ్రాభరణాలు, వాచ్ కనిపించలేదు. ఈ నెల 24వ తేదీన ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత ఇంట్లో చూడగా ఎక్కడా కనిపించలేదు. బ్యాంకు లాకర్లో కూడా దొరకలేదు. అయితే ఇంట్లో పని చేసే శ్రీలత అనే పనిమనిషి తాను మంగోలియా వెళ్లే సమయంలో బ్యాగును సర్దిందని ఆ సమయంలో వాటిని తస్కరించి ఉంటుందని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కూరగాయల ధరలు

**శ్రీనగర్‌కాలనీ:** ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 21, నల్లవంకాయ 45, పొడుగువంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 40, క్యాప్సికం 70, పచ్చికాకరకాయ 60, పందిరిబీర 45, క్యాబేజీ 16, క్యారెట్ 35, దొండకాయ 50, గుండు బీన్స్ 45, గింజచిక్కుడు 65, గోకరకాయ 50, కీర 15, దోసకాయ 35, బీట్‌రూట్ 25.

## విద్యతోపాటు ఇతర రంగాల్లోనూ రాణించాలి

**వెంగళరావునగర్:** యువత మల్టీ టాలెంటెడ్‌గా ఉండాలని, అప్పుడే జీవితంలో లక్ష్యాలను సులువుగా సాధించగలమని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.నవీన్‌యాదవ్ సూచించారు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న మాస్టర్స్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సవేరా ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నవీన్‌యాదవ్ మాట్లాడుతూ... నచ్చిన రంగాల్లో ఎప్పటికప్పుడు అవకాశాలను అందిపుచ్చుకొని రాణించాలన్నారు. కళాశాల చైర్మన్ రమేష్ మాట్లాడుతూ... విద్యార్థులు కొన్నేళ్లుగా జరిగిన పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు నవీన్‌యాదవ్ బహుమతులను ప్రదానం చేశారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ


పడిపూజలో పాల్గొన్న విజయారెడ్డి

**పంజగుట్ట:** చింతల్‌బస్తీ గణేశ దత్తసాయి మందిర్ వద్ద రమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజను ఘనంగా జరిగింది. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.